AIJRELPLS VOLUME 6, ISSUE 3 (2021, MAY/JUN) (ISSN-2456-3897)ONLINE
Anveshana's International Journal Of Research In Education, Literature, Psychology And Library Sciences

# మహబూబాబాద్ జిల్లాలో మారిన గ్రామ నామాలు

**కోర్గు సత్యనారాయణ**-పరిశోధక విద్యార్థి
చరవాణి: 9177664447
తెలుగు శాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం

ప్రస్తుతం మహబూబాబాద్‌గా వ్యవహారంలో ఉన్న ఈ పట్టణం చాలా కాలం ' మానుకోట'గా పిలువబడేది. చుట్టూ మానులతో నిండి ఉన్న మట్టికోట ఇక్కడ ఉండేది. అందువల్లనే మానుకోటగా పేరొచ్చిందని జనానుశ్రుతి. అదే కాలక్రమంలో మానుకోటగా మారింది. తర్వాత మహబూబాబాద్ అయింది.

6వ నిజాం మహబూబ్ అలీఖాన్ వేట యందు ఆసక్తి కలవాడు. తరచూ మృగయా వినోదములలో పాల్గొనేవాడు. మానుకోట ప్రాంతం దట్టమైన ఆడవులతో కూడిన ప్రాంతం కాబట్టి అప్పుడప్పుడు ఈ ప్రాంతమునకు వేటకు వచ్చేవాడు. అతడు వేటకు వచ్చినప్పుడు కొంతకాలం ఇక్కడ నివాసముండేవాడు. మానుకోటగా పిలుచుటకుకారణమైన మట్టికోట ఒకటి ఇక్కడ ఉండేదని, ఆ కోటకు దగ్గరలో నిజాం నివాసమొకటి ఏర్పరచుకొని ఉండేవాడని తాను 'శిఖారు(వేట) చేసిన అడవి మాంసాన్ని తినే 'గడ్డ'ను శిఖార్‌ఖానగడ్డ' గా వ్యవహరించడం మొదలైందని అంటారు. అందుకు సాక్ష్యంగా మహబూబాబాద్‌లోని పాతబజార్ సమీపంలోని వాడకు శిఖార్ ఖానగడ్డ నేటికి వ్యవహారంలో ఉంది.

6వ నిజాం 1911 సంవత్సరంలో తీవ్ర అనారోగ్యానికి గురై మరణించాడు. అతని జ్ఞాపకంగా ఈ పట్టణానికి మహబూబాబాద్ అనే పేరు వాడుకలోకి వచ్చింది. 'ఆబాద్' నివాసము అని అర్థం.

మహబూబ్ అలిఖాన్ నివాసమున్న ప్రాంతం కనుక అప్పటి ముస్లిం అధికారులు దీనికి మహబూబ్ ఆబాద్ గా నామకరణం చేసి ప్రభుత్వ రికార్డుల్లోకి ఎక్కించారు. క్రమంగా అది రైల్వే రికార్డుల్లో కూడా చేరి రైల్వేస్టేషన్ బోర్డులపై ' మహబూబాబాద్ ' అని రాయబడి ఉండటం వల్ల ఎక్కువగా జన ప్రచారంలోకి వచ్చింది.

మానుకోట పట్టణంలోని ప్రసిద్ధ వైష్ణవాలయం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం కాకతీయుల కాలం నాటికే నిర్మితమైనట్లు చరిత్ర చెబుతుంది. కాకతీయులు మొదట జైనులై తర్వాత శైవ స్వీకరించారు. గణపతి దేవ చక్రవర్తి చెల్లెలు మైలాంబ ఇనుగుర్తిలో ఒక గోపాలకృష్ణుని ఆలయం నిర్మించి, దాని నిర్వహణ కోసం దానాలు చేసినట్లు ఇనుగుర్తిలోని శాసనం వల్ల తెలుస్తుంది. ఆ తర్వాత వెలమ రాజులు కూడా కందికొండలో వైష్ణవాలయాలు నిర్మించి వారి పేర దానాలు చేసినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. అలాంటిదే ఈ వేణుగోపాలస్వామి ఆలయం. రుద్రమదేవి ఈ వేణుగోపాల స్వామి దర్శనం కోసం వచ్చి ఆలయం ముందున్న గుండంలో పవిత్రస్నానం చేసి దైవదర్శనం చేసుకునేదని ఆనాటి నీటి గుండం కాలక్రమంలో శిథిలమైపోయింది. రుద్రమదేవి పరిపాలనా కాలమైన క్రీ.శే. 1268 సం॥ నాటి శాసనంలో కాకతి రుద్రదేవ మహారాజుకు అల్లుడుగా చెప్పబడిన ధర్మగోవిందసెట్టి ఇక్కడి లోకనాథ ఆలయం నిర్వహణ కోసం కొన్ని దానాలు చేశాడు. ఈ గ్రామంలోని లోకనాథాలయం కాకతి రుద్రదేవ మహారాజు కాలం నాటి నిర్మాణమైనట్లు తెలుస్తుంది. ఈ గ్రామంలో తొలితరం కాకతీయుల నాటి శివాలయం కూడా ఉంది. మరో ఆలయం వెంకటేశ్వరస్వావమి స్వయంభూవుగా రెండు బండరాళ్ళమధ్య వెలిశాడు.

**తట్టుపల్లి:**

ఈ గ్రామం మహబూబాబాద్ పట్టణానికి 16 కి.మీ. దూరాన ఉన్నది. కాకతీయుల శాసనాలలో ఈ గ్రామ ప్రస్తావన ఉన్నది. పూర్వం నేరడ–కందికొండ రహదారి మార్గం దట్టమైన అరణ్యాలతో, వన్యమృగాలు అధికంగా ఉండి, రహదారుల వెంట ప్రయాణికులు గుంపులుగా కాలినడకన ప్రయాణం చేసేవారు. నేరడ నుండి కందికొండ వెళ్ళె మార్గం గుండా ప్రయాణం చేసే బాట సారులు ప్రస్తుతం ఈ గ్రామం ఉన్న ప్రాంతం చేరే సరికి చీకటి పడి ప్రయాణాన్ని వాయిదా వేసేవారట. నెరడ నుండి వచ్చు వారు, ఇటు కందికొండ ప్రాంతం నుండి వచ్చేవారు ఈ గ్రామంలో తట్టిపడిపోయేవారట. తదనంతరం కాలంలో ఆ గ్రామాన్ని తట్టిపల్లిగా పిలుస్తూ, కాలక్రమేణా తట్టుపల్లిగా పిలుస్తున్నారు. పూర్వ 'తట్టిపల్లియా అని పిలిచేవారు. మానుకోటలోని వేణుగోపాలస్వామి దేవాలయంలోని కాకతీయ ప్రతాపరుద్రుని కాలానికి చెందిన ఒక శాసనంలో అష్టాదశ ప్రజలు అనగా 18 కులాల వారు, మరికొందరు కలిసి 'తట్టుపల్లియ' అనే పురంలోని జయేశ్వర దేవాలయానికి రుదిరోద్గారి నామ సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమి నాడు కొన్ని దానాలు చేసినట్లు శాసనం తెలుపుతుంది.

కాకతీయు చివరి చక్రవర్తి అయిన ప్రతపారుద్రుని కాలం నాటికి 'తట్టుపల్లియా' అని పిలుస్తున్నారు. అంటే తట్టుపల్లియ అనే పేరుతో పురంగా అంటే నేటి పట్టణస్థాయి గ్రామంగా ఉన్నది. ప్రస్తుతం తట్టుపల్లి చిన్న గ్రామంగానే ఉన్నా దాని పూర్వవైభవానికి గుర్తుగా అక్కడ కోటగోడల అవశేషాలు ఉన్నాయి.

ఈ గ్రామంలో జయేశ్వరాలయం పూర్తిగా శిధిలమైంది. ఇటీవలి కాలంలో గుప్తనిధులు తవ్వకాల దొంగల ప్రభావంతో అందులో ఉన్న పూర్వకాలపు శివలింగం కూడా స్థానభ్రంశమై ఉంది.

**తొర్రూరు:**

తొర్రూర్ గ్రామ చరిత్రను చూసినప్పుడు. ఒక నాటి వైభవానికి ప్రత్యక్షసాక్షిగా నేటికి పట్టణంలో శిధిలావస్థలో ఉన్న ఘడీ(కోట) వల్ల ఈ గ్రామానికి తొర్రూరుగా పేరోచ్చినట్లు తెలుస్తుంది. నిజాం రాజావారి ఘడీగా చెప్పుకునే ఈ ఘడీకి శత్రువుల దాడి వల్ల ఒక 'తొర్ర' అనగా రంధ్రం ఏర్పడిందట ఆ తొర్రవల్ల తొర్రూరుగా వ్యవహారంలోకి వచ్చిందని స్థానికుల చెబుతుంటారు.

రాజావారి ఘడీ కథనంలోనే ఈ గ్రామానికి 'రంధ్రపుర' మనే పేరు కూడా ఉన్నట్లు చెప్పుకుంటారు.

ఆ రాజావారు ఏ కాలానికి చెందినవారు ? కోట ఏ కాలంలో నిర్మించబడింది? అనే విషయాలు ఆధారాలతో తెలియాల్సిఉంది. నిజాం నవాబుల కాలానికి చెందినదిగా కొందరు చెప్తున్నా దానికి సంబంధించిన ఆధారాలు స్పష్టంగా లేవు. కోటకు సంబంధించిన 'ఘడీ' అనే పేరు తప్ప ముస్లీం శైలిలో వ్యవహారమేది కనబడకపోవడం కూడా ఈ అనుమానానికి అవకాశమిస్తుంది. పైగా తెలంగాణలో తొర్రూరు అనే పేరుతో చాలా గ్రామాలు ఉన్నాయి. వాటికి ఆ పేరు స్థిరపడటానికి కూడా కారణం 'రంధ్రమే ' అయితే ఆ రంధ్రం ఎటువంటి రంధ్రం ? దాడులవల్ల ఏర్పడిందా? ప్రకృతి స్థింగా ఏర్పడిదా ? లేక మరైదైనా కారణముందా ? అని కూడా ఆలోచించాల్సి ఉంటుంది.

**కేసముద్రం: –**

కాకతీయ రాజులలో మొదటి బేతరాజుకాలం నాటికి వారి స్వతంత్ర పాలన ఆరంభమైంది. బేతరాజు కొడుకు మొదటి ప్రోలరాజు పరిపాలన కాలంలో చెరువులు, కుంటలు గ్రామాల నిర్మాణం జరిగింది. (శాసనాలు ఆధారం) మొదటి ప్రోలరాజుకు 'అరిగజకేసరి' అనే బిరుదముంది. అరిగజకేసరి అంటే 'ఏనుగుల వంటి శత్రువులకు సింహంలాంటి వాడు' అని అర్థం. ఆనాటి ప్రభువులు చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు వారి బిరుదములతోనే ప్రచారం కల్పించే

వారు. ప్రోలరాజుకు తన 'కేసరి బిరుదములో ఒక తటాకాన్ని త్రవ్వించాడు. అదే కేసరి తటాకం, కేసరి సముద్రం అనే పేర్లతో ఆనాటికి వాడుకలో ఉంది. ఈ విషయం బయ్యారం, హన్మకొండ శాసనాలలో కనబడుతుంది. కేసరి సముద్రానికి సమీపంలో ఆడవులను నరికి వ్యవసాయ యోగ్యం చేసి గ్రామాన్ని నిర్మించారు. దానితో ఆ గ్రామం కేసముద్రంగా ప్రచారంలోకి వచ్చింది.

చారిత్రక ప్రశస్తి కలిగిన కేసముద్రం గ్రామం వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయ కేంద్రంగా కూడా లాచా ప్రసిద్ధిని పొందింది. ఈ గ్రామం చుట్టు ఉన్న అనేక గ్రామాలు, గిరిజన తండాలు ఇక్కడి వ్యాపార, వాణిజ్యాలకు ప్రధానంగా కారణమవుతున్నాయి. దానికి తోడు ఇక్కడ ఉన్న వ్యవసాయ మార్కెట్ నిర్వహణలో ప్రత్యేకతను కల్గి ఉండి. ఈ గ్రామానికి వ్యాపార రంగంలో విస్తృతపరిధిలో పేరు ప్రతిష్ఠలు వచ్చాయి.

కాకతీయ ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టిన సందర్భంలో కేసరి సముద్రంను నిర్మించారు. ఆనాటి రాజు చేపట్టిన ప్రజాసంక్షేమాధి కార్యక్రమాలు ఆ రాజుకున్న బిరుదములతోనే ప్రచారం కల్పించారు. ఈ పద్ధతిని ప్రోలరాజు తర్వాతి కాలానికి చెందిన మైలాంబ విషయంలోను చూస్తాం. మైలాంబకు 'ధర్మకీర్తి' అనే బిరుదువుండేది. ఆమె బిరుదు పేరు మీదుగానే బయ్యారం చెరువు, ధర్మసాగరం చెరువు నిర్మించింది. ధర్మకీర్తి పేరుతో ధర్మసాగరం అనే పేరు వచ్చింది. కాని బయ్యారం చెరువును మాత్రం ఆమె తల్లి బయ్యమాంబ లేదా బయ్యాల దేవి పేరుతో నిర్మించిన బయ్యారం గ్రామం ఆధారంగా ఆ చెరువుకు బయ్యారం చెరువు అని వాడుకలోకి వచ్చింది.

వ్యవసాయికంగా అభివృద్ధిని సాధించిన కేసముద్రం ప్రాంతానికి ఒక వ్యవసాయ మార్కెట్ అవసరమని 1965 సంవత్సరంలో ప్రభుత్వం ఒక వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాట చేసింది. ఈ మార్కెట్ పసుపు క్రయవిక్రయాలకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడికి వచ్చే పసుపు నాణ్యతపరంగా తమిళనాడులోని ఈ రోడ్ మార్కెట్‌తో పోటీ పడుతుంది. ఈ గ్రామంలో 1960లో నిర్మాణమైన రామమందిరం, గురుమందిరం, ఆంజనేయ స్వామి గుడులున్నాయి. ముస్లీంలు నమాజు చేసుకోవడానికి గ్రామం మధ్యలో ఏక్‌మినార్ మసీదు, కేసముద్రం విలేజిలో యాకసాయన్న దర్గాగా పేరొందిన విలేజి కేసముద్రంలోని ముస్లీం ప్రార్థనా మందిరం హిందు–ముస్లీం మత సామరస్యానికి నిదర్శనం.

**అమీనాపురం:–**

ఈ గ్రామం ఏర్పడటానికి మొదటి కారణం రైల్వేట్రాక్ నిర్మాణాకి పనిచేసిన కార్మికులు ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడం గ్రామం వృద్ధి చెందడంతో చుట్టు ప్రక్కల గ్రామల వారు వ్యాపార నిమిత్తం వచ్చేవారు. కాల క్రమేనా గ్రామం వృద్ధి చెంది పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగింది. నిజాం కాలంలో పోలీసు అదికారిని 'అమీన్‌సాబ్' అనే వారు.

ఆ అమీన్‌సాబ్ నివాసమున్న ప్రాంతానికి 'అమీనాపురం' గా పేరు వచ్చింది.

**చిన్నముప్పారం: –** పూర్వం వరంగల్లు జిల్లా పరిధిలో ముప్పారం పేరుతో ఉన్న గ్రామాలన్నీ రెండవ ప్రోలరాజు కాలంలో లేక ఆ తర్వాత కొద్దికాలంలో నిర్మించబడినవే.

రెండవ ప్రోలరాజు భార్య ముప్పాంబ పేరిట నిర్మించబడి ముప్పవరం పేరుతో వాడుకలోకి వచ్చిన గ్రామాలివి. కాలక్రమంలో జన వ్యవహారమందు ముప్పారంగా పిలువబడుతున్నాయి. చెట్లు అధికంగా ఉన్న గ్రామం చెట్ల ముప్పారం.

వైశాల్యంలో జన సంఖ్యలో పెద్దదిగా ఉన్నది పెద్దముప్పారంగా పిలువబడుతున్నాయి.

చిన్న ముప్పారం, పెద్దముప్పారం గ్రామాలు రెండూ రజాకార్లకు కేంద్ర యూనియన్ సైన్యాలకు తిరుగుబాటు చేసి చరిత్రలో నిలిచిన గ్రామాలు.

**ఈదులపూసపల్లి: –**

మహబూబాబాద్ పట్టణానికి 4 కిలోమీటర్ల దూరాన ఈ గ్రామం కలదు.

ఈదులపూసపల్లి గ్రామం వృక్షనామ సంబంధ సూచి, పూర్వం నుండి ప్రస్తుతం కాలం వరకు ఈదులు అధిక సంఖ్యలో ఉన్నాయి. ఈదుల ప్రక్కన వెలసిన గ్రామం కాబట్టి ఈదులపూసపల్లిగా స్థిరపడిపోయింది.

‘పల్లి ’ అనగా చిన్నజనపదము. ఆటవికుల ఆవాసము, గుడిసె ఇల్లు అనే అర్థాలు న్నాయి. తెలంగాణాలోని గ్రామనామాల్లో అధిక సంఖ్యలో చోటు చేసుకున్న గ్రామనామానుబంధం పల్లి.

**ఆలేరు:**

ఈ గ్రామం మహబూబాబాద్ పట్టణానికి 15 కీ.మీ. దూరాన ఉన్నది. ఈ గ్రామానికి సమీపాన ఒక ఏరు కలదు. పూర్వం ఈ ప్రాంతం దట్టమైన అరణ్యాలతో కూడి ఉండేది. గ్రామ పేరులోని ప్రథమావయవంగా ‘ఆల’శబ్దం ఉన్నది. ఆల అనగా ఆలముతో కూడినది అని అర్థం. తీగలుగా ప్రాకుడు జాతికి చెందిన మొక్కలు, కూరాకు మొక్కలలో కూడా ‘ ఆల’ శబ్దము గలదు. గ్రామ నామం లోని ద్వితీయావయంగా ‘ఏరు’ అనే పదం ఉంది. ఈ గ్రామ సమీపంలో ఏరు ఉన్నందున, ఇక్కడ నీరు లభించడం చేత ఆవాసాలు ఏర్పడి కాలక్రమంలో ఆలేరుగా మారింది. ఇలా సమీపంలో గల మారో గ్రామం వావిలాల. ఈ గ్రామంలోని ప్రథమావయవంగా ‘వావిలి’ అనే పదం గలదు. వావిలి వృక్షసంబంధమైనది. ‘ఆలా ’ అనగా అలము. వావిలి వృక్షాలు అలముగా, పొదలుగా విస్తరించిన ప్రాంతం కాబట్టి ఆ ప్రాంతంలో వెలిసన గ్రామానికి వావిలాలగా నామకరణం చేశారు.

**రావిరాల:**

ఈ గ్రామం మహబూబాబాద్ పట్టణానికి 18 కీ.మీ. దూరాన ఉన్నది. గ్రామ పేరులోని ప్రథమమావయంగా ‘రావి’ అనే పదం కలదు. ‘రావి’ అనేది వృక్షములు. గ్రామ పేరులోని ద్వితీయావయంగా ‘రాల’ అనే పదం కలదు. ‘రాల ’ అనగా వాగు దాటు ప్రదేశం అని అర్థం. ఈ గ్రామానికి సమీపాన వాగు ఉన్నది. వాగు దాటు ప్రాంతంలో ఉన్న రావివృక్షాల కారణంగా అక్కడ వెలిసన గ్రామానికి‘ రావిరాల’ గా నామకరణం చేయడం జరిగింది.

ఆధార గ్రంధాలు: –


1. వరంగల్ జిల్లా విజ్ఞాన సర్వస్వం – డా॥ జి.వి. రత్నం
2. మానుకోట మణిహారం – మద్దెర రమేష్
3. తెలుగు అకాడమి నిఘంటువు.